క్లుప్తంగా

రూ.లక్ష ఆర్థికసాయం



ఆర్థికసాయాన్ని అందజేస్తున్న పూర్వ విద్యార్థుల, స్నేహితులు

ఆమదాలవలస: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1993–94లో పదో తరగతి చదివిన చేట్ల రామ్మకృష్ణ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. ఆ కుటుంబాన్ని ఆదుకునేందుకు పూర్వ విద్యార్థులు, తోటి స్నేహితులు సంకల్పించారు. విరాళాల రూపంలో సేకరించిన రూ.లక్షను ఆమదాలవలసలో ఉన్న రామకృష్ణ కుటుంబ సభ్యులకు ఆదివారం అందించారు. మృతినికి భార్య లావణ్య, కుమారుడు, తల్లి సరస్వతి ఉన్నారు. పూర్వవిద్యార్థుల సంఘం నాయకులు కటకం పూర్ణచందరరావు, ఎం.బాలసుబ్రహ్మణ్యం, దుప్పలపూడి శ్రీనివాస్, మాడుగుల శ్రీనివాస్, కాత్రు సుధాకర్, బేద్రి హరిప్రసాద్, ఊటపల్లి శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

అఖండ దివ్యనామ సంకీర్తన ముగింపు



మాట్లాడుతున్న సత్యసాయి సేవా సంస్థల జిల్లా అధ్యక్షుడు లింగరాజు

పాతపట్నం: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎదురుగా ఉన్న సత్యసాయి బాబా మందిరంలో సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో వంద గంటల అఖండ దివ్యనామ సంకీర్తనలు ముగింపు కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. సత్యసాయి బాబా 98వ జన్మదిన వేడుకల్లో భాగంగా పాతపట్నం బాబా మందిరంలో వంద గంటల అఖండ దివ్యనామ సంకీర్తనలను 33 భజన మండలుల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా సత్యసాయి సేవా సంస్థల జిల్లా అధ్యక్షుడు లింగరాజు మాట్లాడుతూ బాబా పుట్టిన రోజు వేడుకలు ఘనంగానిర్వహించామన్నారు.ఈ కార్యక్రమంలో కన్వీనర్ ఎస్.శ్రీనివాసరావు, జోనల్ కోఆర్డినేటర్ రమణమూర్తి, ప్రసాదరావు, గుప్త, వెంకటరమణ, సత్యనారాయణ, సత్యసాయి సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

శరవేగంగా రైల్వే ట్రాక్ పనులు



యంత్రాలతో ట్రాక్ పనులు చేస్తున్న దృశ్యం

పాతపట్నం: మండలంలోని గంగువాడ సమీపంలోని రైల్వే గేటు వద్ద ట్రాక్ పనులు రైల్వే ఉన్నతాధికారులు ఆధ్వర్యంలో యాంత్రాలతో ఆదివారం యుద్ధ ప్రతిపాదికన చేపట్టారు. ఉదయం 6 గంటలకే పాతపట్నం–టెక్కలి రహదారిలో ఉన్న రైల్వే గేటును పూర్తిస్థాయిలో మూసివేశారు. ట్రాక్ పనులు పూర్తయిన వెంటనే గేటు తీశారు. పనులు చేపట్టడంతో ట్రాఫిక్‌ను టెక్కలి నుంచి తెంబూరు మీదుగా సారవకోటకు మళ్లించారు. ముందుగానే ట్రాఫిక్‌కు అంతారాయం ఉంటుందని రైల్వే అధికారులు తెలియజేయడంతో వాహనదారులు ఇటువైపు రాలేదు. గత పదిహేను రోజులుగా పర్లాకిమిడి–తెంబూరు మధ్య రైల్వే ట్రాక్ పనులు వేగవంతం చేశారు.

విద్యుత్ తీగలు చోరీ

సారవకోట: మండలంలోని తొగిరి ఎత్తిపోతల పథకానికి ఏర్పాటు చేసిన విద్యుత్ తీగలు చోరీ చేశారని సంబంధిత అధికారులతోపాటు పథకం అధ్యక్షుడు కత్తిరి అప్పలనాయుడు స్థానిక పోలీసు స్టేషన్లో శనివారం ఫిర్యాదు చేశారు. ఎత్తిపోతల పథకం ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతులకు గురికావడంతో కొంత కాలంపాటు నిరుపయోగం ఉంది. దానిని మరమ్మతులు చేసేందుకు నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్.. నిధులు మంజూరు చేశారు. మరమ్మతులు చేయించేందుకు అధ్యక్షుడు వెళ్లి చూడగా.. దానికి సంబంధించిన విద్యుత్ తీగలు చోరికి గురైనట్లు గుర్తించారు. దీనిపై సంబంధిత అధికారుల ద్వారా పోలీసులకు ఫిర్యాదు చేశారు.

నేడు వైఎస్సార్‌సీపీ సమావేశం

పాతపట్నం: ఈ నెల 6వ తేదీన వైఎస్సార్‌సీపీ నాయకులతో సమావేశం నిర్వహించనున్నట్లు పార్టీ మండల సచివాలయ కన్వీనర్ ఏనుగుతల సూర్యం ఆదివారం తెలిపారు. పాతపట్నం బ్రాహ్మణవీధి కూడలిలోని కేఎస్ఎం ప్లాజాలో ఉదయం 9.30 గంటలకు ఈ కార్యక్రమం ఉంటుందన్నారు. వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంపై పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి అవగాహన కల్పిస్తారన్నారు. ప్రజాప్రతినిధులు, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, అభిమానులు పాల్గొనాలని కోరారు.

అర్హులందరికీ ఓటు హక్కు



కొత్తూరు: కొత్తూరు జీజే కళాశాల వద్ద ఓటర్ల తహసీల్దార్‌కు వివరాలు అడుగుతున్న కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్

- జిల్లా కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్

కొత్తూరు: అర్హులందరికీ ఓటు హక్కు కల్పించాలని, ప్రతి పోలింగ్ స్టేషన్‌లో ఓటర్ జాబితాను ప్రదర్శించాలని జిల్లా కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ అన్నారు. మండలంలోని కొత్తూరు, పారాపురం గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను ఆదివారం తనిఖీ చేశారు. స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా చేపడుతున్న ఓటరు నమోదు ప్రక్రియను పరిశీలించి, వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఓటరు నమోదు కార్యక్రమంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. బీఎల్‌ఓలు సమర్థవంతంగా పనిచేయాలని, పక్కాగా ఓటరు జాబితా తయారు చేయాలన్నారు. మండల అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి చక్రవర్తి, బీఎల్‌ఓలు పాల్గొన్నారు.

సరుబుజ్జిలిలో..

సరుబుజ్జిలి: ఓటర్ల జాబితా నమోదు సక్రమంగా నిర్వహించాలని తహసీల్దార్ లక్ష్మీనారాయణ తెలిపారు. ఓటర్ల నమోదు స్పెషల్ డ్రైవ్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని రావివలస, పాలవలస, పెదవెంకటాపురం, పెద్దసవళాపురం, సింధువాడ, పురుషోత్తపురం గ్రామాల్లో గల పోలింగ్ కేంద్రాలను ఆదివారం సందర్శించారు. డోర్ నంబర్లు అడ్రస్‌లు సక్రమంగా చూడాలని బీఎల్‌ఓలకు సూచించారు. వీఆర్వోలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నరసన్నపేటలో..

నరసన్నపేట: ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు బీఎల్‌ఓలు బాధ్యతగా పనిచేయాలని, వారికి అప్పగించిన పనులు సకాలంలో పూర్తిచేయాలని నరసన్నపేట తహసీల్దార్ ఎ.సింహాచలం అన్నారు. ఓటర్లు నమోదుకు సంబంధించి ప్రత్యేక శిబిరాలను ఆదివారం పరిశీలించారు. నరసన్నపేట టౌన్‌తోపాటు పరిసర గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను సందర్శించారు. ఓటర్ల నమోదుకు బీఎల్‌ఓలు తీసుకుంటున్న చర్యలు తెలుసుకున్నారు. ఓటర్లు జాబితా స్వచ్ఛీకరణ చేయడానికి ప్రయత్నించాలని కోరారు. మరణించిన వారి పేర్లు తొలగించాలని సూచించారు. రాజకీయ పార్టీలకు చెందిన బీఎల్ఏలు ఇచ్చిన ఫిర్యాదులపై స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని, వివాదాలకు తావివ్వొద్దని సూచించారు. ఎన్నికల విభాగం సిబ్బంది లుకలాపు శ్రీను, మురళి తదితరులు పాల్గొన్నారు.

ఎల్.ఎన్.పేటలో..

ఎల్.ఎన్.పేట: ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం జనవరి నాటికి 18 ఏళ్లు వయస్సు నిండిన వారంతా ఓటు హక్కుని పొందేలా గ్రామాల్లో అవగాహన కల్పించాలని తహసీల్దార్ ఆర్.అప్పలరాజు అన్నారు. మండలంలోని యంబరాం, పెద్దకోట పోలింగ్ కేంద్రాల్లో జరుగుతున్న ఓటు నమోదు ప్రక్రియను ఆదివారం ఆయన పరిశీలించారు. ఓటర్ల జాబితాల్లో ఎలాంటి తప్పులు లేకుండా ఉండాలన్నారు. రాజకీయ పార్టీల నాయకులతో చర్చించి సమగ్రమైన ఓటర్ల జాబితాలను సిద్ధం చేసే బాధ్యత బీఎల్‌ఓలపై ఉందన్నారు. చనిపోయిన, వివాహం జరిగి అత్తవారింటి ఇంటికి వెళ్లిన, శాశ్వతంగా వలస వెళ్లిన వారి ఓట్లును కుటుంబ సభ్యుల అనుమతితో తొలగించాలన్నారు. ఆర్ఐ, రెవెన్యూ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

జలుమూరులో..

జలుమూరు: అర్హులందరికీ ఓటు హక్కు కల్పించనున్నామని తహసీల్దార్ బి.సత్యం అన్నారు. జోనంకి, కెఎల్ఎన్‌పేట గ్రామాలలో ప్రత్యేక ఓటర్ల నమోదు కార్యక్రమాన్ని ఆదివారం పరిశీలించారు. ఒకే వ్యక్తికి ఒకే చోట ఓటు ఉండాలని, వేరేచోట ఓటు ఉంటే వాటిని తొలగించాలన్నారు. అలాగే శాశ్వతంగా వలస వెళ్లినవారి పేర్లు తొలగించాలన్నారు. బోగస్ ఓట్లుపై వచ్చిన ఫిర్యాదులు పరిశీలించాలన్నారు. సర్వేయర్ తిరుపతిరావు, ఆర్ఐ సతీష్ తదితరులు పాల్గొన్నారు.

హిరమండలంలో..

హిరమండలం: ఎన్నికల కమిషనర్ ఆదేశాల మేరకు అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించాలని పాతపట్నం నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఆర్.వెంకటరావు అన్నారు. హిరమండలం మండల కేంద్రంలోని పోలింగ్ కేంద్రల్లో ప్రత్యేక ఓటర్ల నమోదు కార్యక్రమాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎన్నికల రిటర్నింగ్ అధికారి మాట్లాడుతూ పోలింగర్ కేంద్రాల పరిధిలోని ఫిర్యాదులను స్వీకరించి, తక్షణమే పరిష్కరించాలన్నారు. తహసీల్దార్ మురళీమోహన్, ఎలక్షన్ డీటీ శైలజ, బీఎల్‌ఓలు పాల్గొన్నారు.

పాతపట్నంలో..

పాతపట్నం: అర్హత ఉన్న ప్రతి ఒక్కరూ ఓటు నమోదు చేసుకోవాలని, ఇటీవల ఓటరు జాబితా విడుదల చేశామని తహసీల్దార్ కె.రవిచంద్ర అన్నారు. ఆదివారం ఓటరు నమోదు స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా మండలంలోని పాతపట్నం, కొదూరు గ్రామాల్లోని పోలింగ్ బూత్‌లను పరిశీలించారు. బీఎల్‌ఓలు తప్పులను సరిచేయాలని, ఓటరు జాబితా సక్రమంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ఆర్.భువన్‌కుమార్, బీఎల్‌ఓలు పాల్గొన్నారు.

బీఎల్ఓ గైర్హాజరు!

పొందూరు: ఓటు నమోదు, మార్పులు, చేర్పుల కోసం ఎన్నికల కమిషన్ రెండు రోజుల స్పెషల్ డ్రైవ్ కార్యక్రమం చేపట్టింది. గ్రామాల్లోని ప్రతీ పోలింగ్ బూత్‌లోనూ సంబంధిత అధికారులు, బీఎల్‌ఓలు విధిగా హాజరుకావాలని అధికారులు ఆదేశించారు. మండలంలోని పెనుబర్తి పంచాయతీలోని అలమాజీపేట పోలింగ్ బూత్‌లో బీఎల్ఓ గైర్హాజరయ్యారు. దీంతో బూత్‌కు వెళ్లిన గ్రామస్తులు వెనుదిరగాల్సి వచ్చింది. బీఎల్ఓ గైర్హాజరుపై ఎంపీడీఓ సీపాన హరిహరరావుకు అడుగగా.. తనకు ఎటువంటి సమాచారం ఇవ్వలేదని చెప్పారు.



సరుబుజ్జిలి: పాలవలసలో ఓటర్ల జాబితాలను పరిశీలిస్తున్న తహసీల్దార్



హిరమండలం: ఓటర్ల జాబితాను పరిశీలిస్తున్న ఆర్వో వెంకటరావు



జలుమూరు: జోనంకిలో ఓటర్ల జాబితాను పరిశీలిస్తున్న తహసీల్దార్ సత్యం



నరసన్నపేట: ప్రభుత్వ డిగ్రీ కళాశాల వద్ద బీఎల్‌ఓకు సూచనలిస్తున్న తహసీల్దార్

నాణ్యతకు తిలోదకాలు!



నాణ్యత లేని ఇనుప ఊచలతో వేసిన సిమెంట్ పలకలను చూపిస్తున్న బూరాడ రాజేష్

- కాలువ పనుల్లో టీడీపీ సర్పంచ్ నిర్వాకం



పలక ఏర్పాటుకు వినియోగించిన పాత ఇనుప ఊచలు

కొత్తూరు: నివగాం గ్రామంలోని కాపువీధిలో చేపడుతున్న కాలువ నిర్మాణ పనుల్లో నాణ్యత లోపించిందనే ఆరోపణలు స్థానికుల నుంచి వస్తున్నాయి. కాలువలపై పైకప్పుగా వేసే పలకల నిర్మాణాల్లో నాణ్యతాలోపం స్పష్టంగా కనిపిస్తోంది. కాలువ పైకప్పులుగా వేసేందుకు సిమెంట్ పలక నిర్మాణంలో గతంలో వాడిన నాణ్యత లేని ఇనుప గజాలను వినిగించినట్టు స్థానికులు చెబుతున్నారు. నివగాం గ్రామ పంచాయతీ జనరల్ గ్రాంట్ నిధులు సుమారు రూ. 5.50 లక్షల అంచనా విలువతో కాలువ పనులను టీడీపీ సర్పంచ్ చేపట్టారు. అయితే పనుల్లో ఇష్టానుసారంగా వ్యవహరిస్తూ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించడం లేదు. సిమెంట్ పలకల ఏర్పాటులో కూడా నాణ్యత లేని ఇనుప ఊచలను వినియోగించినట్టు కాపువీధికి చెందిన పలువురు అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ సర్పంచ్ తీరు మారలేదు. కాలువతోపాటు దానిపై వేసేందుకు పలక కోసం మంచి ఇనుప ఊచలను వాడలేదని గ్రామస్తులు చెబుతున్నారు. పాడైన శ్లాబు నుంచి తీసిన పాత ఇనుప గజాలను పలకలు వేసేందుకు వినియోగించినట్టు ఆరోపిస్తున్నారు. అధికారులు దీనిపై దర్యాప్తు చేసి పంచాయతీ నిధులు దుర్వినియోగం కాకుండా చూడాలని స్థానికులు కోరుతున్నారు.

నాణ్యమైన స్టీల్ వాడాం

కాపువీధిలో నిర్మాణం చేపట్టిన సిమెంట్ కాలువలపై వేసే పలకల కోసం నాణ్యమైన ఇనుమును వాడాం. పనుల్లో గజాలు, సిమెంట్ నాణ్యమేనవే. పనుల్లో నాణ్యత పాటించలేదనడం అవాస్తవం. నిబంధనల ప్రకారమే పనులు చేశాం.

మీసాల వనిత, సర్పంచ్ నివగాం

తుప్పపట్టిన గజాలు వినియోగించారు

కాలువపై వేసే పలకల కోసం గతంలో వినియోగించిన తుప్ప పట్టిన ఇనుప గజాలను వాడారు. కాలువ నిర్మాణాల్లో కూడా గ్రేడింగ్ లేని సిమెంట్ వినియోగించారు. కాలువ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించలేదు. దీనిపై అధికారులకు ఫిర్యాదు చేసిన పట్టించుకోలేదు.

–బూరాడ రాజేష్, నివగాం

పనులు చేపట్టినట్టు సమాచారం లేదు

నివగాం కాపు వీధిలో నిర్మిస్తున్న సిమెంట్ కాలువ పనులతో తమకు సంబంధం లేదు. పనులు చేపడుతున్నట్టు సర్పంచ్, కార్యదర్శి నుంచి ఎటువంటి సమాచారం రాలేదు.


– మణికంఠ, జేఈ, ఆర్‌డబ్ల్యూఎస్, కొత్తూరు మండలం

పనులకు అనుమతుల్లేవు

నివగాం కాపు వీధిలో నిర్మిస్తున్న సిమెంట్ కాలువ పనులకు పంచాయతీ తీర్మాణం తప్పా సాంకేతిక, పరిపాలన అనుమతుల్లేవు. పనులు జరుగుతున్నట్టు తనకు తెలియదు. పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించలేదని, నాణ్యత లేని గజాలు వినియోగిస్తున్నారని ఫిర్యాదు రావడంతో పనులు నిలుపుదల చేశాం.

– వెంకటలక్ష్మి, పంచాయతీ కార్యదర్శి, నివగాం

చివరి తడికి పాట్లు



జంబాడ వద్ద సాగునీటి కోసం రైతులు ఏర్పాటు చేసిన దోనే

ఎల్.ఎన్.పేట: సుమారు నెలన్నర రోజులుగా వర్షాలు లేకపోవడంతో వరికి చివరి తడిగా సాగునీరు అందించేందుకు రైతులు అనేక పాట్లు పడుతున్నారు. వంశధార కుడి ప్రధాన కాలువకు ఎగువున ఉన్న రైతులు సాగునీటికి ఇబ్బంది పడుతున్నారు. జంబాడ, కొత్తబాలేరు, సరడాం, జాడుపేట, బొత్తాడసింగి, గొట్టిపల్లి, డొంకలబడవంజ, కొత్తపేట, కొత్తవలస, గోలుకుప్ప, కోతిగార్లపాడు, జోగివలస, మెట్టుగూడ, చొర్లంగి తదితర గ్రామాల్లోని రైతులు వరి పంటకు సాగునీటి కోసం అవస్థలు పడుతున్నారు. చివరి తడి కడితే పంట దక్కడంతోపాటు ఆరుతడి పంటలుగా పెసర, మినుము విత్తనాలు వేసుకునేందుకు అవకాశం ఉంటుందని రైతులు చెబుతున్నారు. కొందరు రైతులు సాగునీటి కోసం ఆయిల్ ఇంజిన్లు ఏర్పాటు చేస్తున్నారు. కొండ దిగువున ఉన్న రైతులు కొండ జక్కరగా వచ్చిన నీటిని దోనెలు ఏర్పాటు చేసుకుని పొలానికి నీటి తడులు అందిస్తున్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన



బీఎల్‌ఓతో మాట్లాడుతున్న కలెక్టర్

ఆమదాలవలస: పురపాలక సంఘ పరిధిలోని 14వ వార్డు పోలింగ్ కేంద్రమైన ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఉన్న మూడు పోలింగ్ కేంద్రాలను కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ ఆదివారం పరిశీలించారు. స్పెషల్ క్యాంపెయిన్ డే సందర్భంగా జూనియర్ కళాశాలలోని మూడు పోలింగ్ కేంద్రాల్లో నమోదైన ఓటర్ల దరఖాస్తులను పరిశీలించారు. ఓటర్ల నమోదు, తొలగింపు, చేర్పులతోపాటు పలు అంశాలపై బీఎల్‌ఓలకు సూచనలు చేశారు. ఫారం 6,7,8 నమోదులో ఎలాంటి అభ్యంతరాలు అయినా ఉన్నాయా అని 32వ పోలింగ్ స్టేషన్‌లో ఉన్న తెలుగుదేశం పార్టీకి చెందిన నాయకుడు కూన రాముకు ప్రశ్నించారు. ఎలాంటి అభ్యంతరాలు, ఇబ్బందులు లేవని ఆయన తెలిపారు. ఇన్‌చార్జి తహసీల్దార్ అమర్‌నాథ్, ఎన్నికల డీటీ మురళీధర్ నాయక్, బీఎల్‌ఓలు పాల్గొన్నారు.

నరసన్నపేట: జిల్లాస్థాయి గణిత పోటీ పరీక్షలకు ఎంపికైన విద్యార్థులు



గణిత ప్రతిభా పరీక్షకు విశేష స్పందన



సారవకోట: నియోజకవర్గ స్థాయికి ఎంపికైన విద్యార్థులతో గణిత ఉపాధ్యాయులు

నరసన్నపేట: స్థానిక బోర్డు ఉన్నత పాఠశాలలో సిక్కోలు గణిత ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన గణిత ప్రతిభా పరీక్షకు విద్యార్థుల నుంచి మంచి స్పందన వచ్చింది. 9, 10వ తరగతుల విద్యార్థుల్లో గణితంలో మెలకవులు తెలియజేసేందుకు గణిత ప్రతిభా పరీక్ష నిర్వహించారు. మండల స్థాయిలో జరిగిన ఈ పరీక్షకు 84 మంది విద్యార్థులు హాజరయ్యారు. వీరిలో జిల్లా స్థాయి పోటీలకు 10 మందిని ఎంపిక చేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు గణిత ఉపాధ్యాయ సంఘం ప్రతినిధులు హర్షవర్ధన శర్మ, బి.కేశవరావు, చిన్ని కృష్ణం నాయుడు మాట్లాడుతూ విద్యార్థుల్లో గణితంపై భయాలను తొలగించేందుకు ఇలాంటి పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉపాధ్యాయులు సాయి శ్రీనివాస్, శైలజ, కనక లత, నూకరాజు, మురళి, ఈశ్వరరావు, నర్సింగరావు, గురునాథం తదితరులు పాల్గొన్నారు.

తాడివలస విద్యార్థుల సత్తా...

పొందూరు: ఏపీ గణిత ఫోరం ఆధ్వర్యంలో మండల స్థాయి గణిత ప్రతిభా పరీక్షలో తాడివలస ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రథమ స్థానాల్లో నిలిచి సత్తా చాటారు. ఆదివారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 9, 10వ తరగతుల విద్యార్థులకు గణిత ప్రతిభా పరీక్షను నిర్వహించారు. 9వ తరగతిలో పాఠశాలకు చెందిన పేడాడ మాధురి ప్రథమ స్థానం, కూన లహరి ద్వితీయ స్థానం, కొత్తకోట తరుణ్ మూడో స్థానంలో నిలిచారు. పదో తరగతిలో తమ్మినైన ఉదయ్‌కిరణ్ ప్రథమ స్థానం, పిల్లలవలస ఉన్నత పాఠశాల విద్యార్థి వి.తేజేశ్వరరావుకు రెండో స్థానం, ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థి జి.అవినాష్‌కు మూడో స్థానంలో నిలిచారు. ఈ విషయాన్ని నిర్వాహకులు శ్రీనివాసరావు, మురళీమోహన్, వేణుగోపాలరావు, సూర్యలక్ష్మి, కృష్ణారావు తదితరులు తెలిపారు.

గణితంపై టాలెంట్ టెస్టు

సారవకోట: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం సిక్కోలు గణిత ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో గణిత టాలెంట్ టెస్టును 9, 10వ తరగతుల విద్యార్థులకు నిర్వహించారు. ఈ పరీక్షకు సారవకోట, చిన్నకిట్టాలపాడు, బుడితి, అలుదు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, కేజీబీవీ, సవరబొంతు ఆశ్రమ పాఠశాలల నుంచి విద్యార్థులు హాజరయ్యారు. వీరిలో 9వ తరగతి నుంచి 9 మంది, 10వ తరగతి నుంచి ఐదుగురు విద్యార్థులకు నియోజకవర్గ స్థాయిలో నిర్వహించనున్న పరీక్షకు ఎంపిక చేసినట్లు నిర్వాహకులు తెలిపారు.

ఫిష్ ఆంధ్రా షాపులు ప్రారంభం



ఫిష్ ఆంధ్రా షాపును ప్రారంభిస్తున్న ధర్మాన కృష్ణచైతన్య

నరసన్నపేట: వినియోగదారులకు లైవ్ ఫిష్ అందించాలనే ఉద్దేశంతో ఏర్పాటు చేస్తున్న ఫిష్ ఆంధ్రా షాపులను వినియోగించుకోవాలని పోలాకి జెడ్పీటీసీ ధర్మాన కృష్ణచైతన్య కోరారు. మండలంలోని పోతయ్యవలస కూడలి వద్ద మినీ ఫిష్ వెండింగ్ యూనిట్‌ను ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కృష్ణచైతన్య మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో మత్స్య ఉత్పత్తులను పెంచేందుకు ఫిష్ ఆంధ్రా షాపులు వినియోగపడతాయన్నారు. వినియోగదారులకు కూడా తాజా చేపలు తక్కువ ధరలకు అందిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకొని ఈ షాపులు మంజూరు చేసిందన్నారు. ఎంపీపీ ఆరంగి మురళి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు చింతు రామారావు, ఎంపీటీసీ మల్లేశ్వరరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు లుకలాపు రవి, కనపల శేఖర్, శానాపతి శ్రీను, బొబ్బాది ఈశ్వరరావు, తోట భార్గవ్, సుధాకర్, ఉపాధి టెక్నికల్ అసిస్టెంట్ మధు తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్యం మెరుగుకు చర్యలు

నరసన్నపేట: మేజరు పంచాయతీ పరిధిలోని ప్రధాన వీధులతోపాటు శివారు వీధుల్లోని మురుగు కాలువల పరిశుభ్రతకు చర్యలు తీసుకుంటున్నట్లు సర్పంచ్ బూరల్లి శంకర్ తెలిపారు. స్థానిక శ్రీదేవినగర్ శివారు వీధుల్లోని మురుగు కాలువలను ఆదివారం పరిశీలించారు. వీధి వాసులకు ఇబ్బంది లేకుండా మురుగు కాలువలను ఎప్పటికప్పుడు శుభ్రం చేస్తామన్నారు.

శ్రీదేవినగర్, శ్రీనివాసనగర్, శ్రీరామనగర్, జయలక్ష్మీనగర్‌లోని కాలువలను శుభ్రం చేస్తామని హామీ ఇచ్చారు. ఈ మేరకు పంచాయతీ సిబ్బందికి తగిన సూచనలు చేశారు.

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత



చెత్త సేకరణ బుట్టలు పంపిణీ చేస్తున్న సర్పంచ్ లక్ష్మి

ఎల్.ఎన్.పేట: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచటంలో అందరూ బాధ్యతగా తీసుకోవాలని మండలంలోని శ్యామలాపురం ఆర్ఆర్ కాలనీ సర్పంచ్ బలగ లక్ష్మి అన్నారు. శ్యామలాపురం పునరావాలస కాలనీలో చెత్త సేకరణ బుట్టలను ఆదివారం పంపిణీ చేశారు.

ప్రతీ ఒక్కరు తడి, పొడి చెత్తను బుట్టల్లో వేసి పారిశుద్ధ్య కార్మికులకు అందజేయాలన్నారు. మన ఇంటిని ఎంత శుభ్రంగా ఉంచుకుంటామో మన పరిసరాలను, మన ఊరిని అంతే పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు బలగ గోవిందరావు, గ్రామ వలంటీర్లు పాల్గొన్నారు.